క్లుప్తంగా

ఉపాధి ఫీల్డ్ అసిస్టెంట్‌కు అభినందన

ఎచ్చెర్ల: లావేరు మండలం వెంకటాపురం గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఈజీఎస్ సాంకేతిక సహాయకుడు ఇప్పిలి గౌరినాయుడును ఎచ్చెర్ల క్లస్టర్ ఏపీడీ లోకేష్, ఎంపీడీపీ కె.సురేష్, సిబ్బంది బుధవారం అభినందించారు. మండలంలోని 9 గ్రామ పంచాయతీల్లో ఎక్కువ మందికి ఉపాధి వేతనదారులకు పని కల్పించారు.

నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం



డీఎంహెచ్‌వో మీనాక్షిని సత్కరిస్తున్న వాకర్స్‌క్లబ్ సభ్యులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నడకతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని డీఎంహెచ్‌వో బొడ్డేపల్లి మీనాక్షి అన్నారు. శ్రీకాకుళం నగరంలోని పెద్దమ్మతల్లి అమ్మవారి ఆలయ ప్రాంగణంలో బుధవారం నిర్వహించిన ఆదిత్య వాకర్స్‌క్లబ్ 21వ వార్షికోత్సంలో ఆమె పాల్గొని మాట్లాడారు. నడక మనిషికి ఔషధంగా పనిచేస్తోందన్నారు. ఈ సందర్భంగా వాకర్స్ క్లబ్ కార్యవర్గం, ఆంధ్రప్రదేశ్ శిష్టకరణంసంఘం అధ్యక్షులు, వాకర్స్ క్లబ్ వ్యవస్థాపకులు పోలు మహంతి ఉమామహేశ్వరరావు దంపతులు డీఎంహెచ్‌వోన మీనాక్షిని సత్కరించారు. కార్యక్రమంలో వాకర్స్ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు రాజ్యాధికారం కల్పించాలి



మాట్లాడుతున్న మత్స్యకార నాయకులు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): మత్స్యకారులకు రాజ్యాధికారం కల్పించే దిశగా రాజకీయ పార్టీలు ఆలోచన చేయాలని మత్స్యకార ఎస్టీ సాధన సమితి అధ్యక్షుడు చింతపల్లి సూర్యనారాయణ కోరారు. శ్రీకాకుళం నగరంలోని కిమ్స్ ఆస్పత్రి రోడ్డులోని ఓ భవనంలో బుధవారం విలేకరులతో మాట్లాడారు. తమకు చట్టసభల్లో ప్రాతినిధ్యం కల్పించాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 40 లక్షల మంది మత్స్యకారులు ఉన్నారన్నారు. సమితి ఉపాధ్యక్షుడు మైలపల్లి నర్సింహమూర్తి మాట్లాడుతూ.. గత పాలకులు తమ సామాజికవర్గాన్ని మోసగించి అధికారంలోకి వచ్చారన్నారు. ఎస్టీ జాబితాలో తమ సామాజిక వర్గాన్ని చేరుస్తామని మాట ఇచ్చి తప్పారని ఆరోపించారు. సమితి కో- కన్వీనర్ పోలీసు, ఇద్ది పాపయ్య, జి.గణేష్‌కుమార్, కొండా సింహాచలం, కొమర మురళి, గణగళ్ల మూర్తి, కొమర రాంబాబు, గణగల్ల కొర్లయ్య. గోవింద మల్లేసు, సూరాడ లక్ష్మణరావు ఉన్నారు.

ఎన్‌ఎంఎంఎస్‌కు విద్యార్థి ఎంపిక



ఎచ్చెర్ల: లావేరు మండంలం లోని బయ్యన్నపేట గ్రామానికి చెందిన అముజూరు శరత్ 8వ తరగతి చదువుతున్నాడు. ఎన్‌ఎంఎంఎస్ ప్రవేశ పరీక్ష రాసి అర్హత సాధించాడు. పాఠశాల సిబ్బంది, గ్రామస్తులు అభినందించారు.

డీటీసీగా చంద్రశేఖర్ రెడ్డి



శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం డీటీసీ (డిప్యూటీ ట్రాన్స్‌పోర్టు కమిషనర్)గా ఎ.చంద్రశేఖర్‌రెడ్డి బుధవారం బాధ్యతలు స్వీకరించారు. ఇదివరకు ఆయన బాపట్లలో డీటీసీగా పనిచేశారు. శ్రీకాకుళం డీటీసీగా పనిచేసిన శివరాంప్రసాద్ కొద్ది నెలలు క్రితం విజయవాడకు బదిలీ అయిన విషయం తెల్సిందే.

నిస్వార్థ సేవలకు సత్కారం



ఉద్యోగ విరమణ పొందిన పోలీసులతో ఎస్పీ, అధికారులు

శ్రీకాకుళం క్రైమ్: గత 35 ఏళ్లుగా ఉద్యోగులుగా ప్రజలకు నిస్వార్థమైన సేవలందించిన పోలీసులకు సమాజంలో ఎల్లప్పుడూ గౌరవం ఉంటుందని ఎస్పీ జి.ఆర్.రాధిక అన్నారు. బుధవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఉద్యోగవిరమణ పొందిన సబ్ ఇన్‌స్పెక్టర్ ఎల్.బాలుడు, జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్ హెడ్ కానిస్టేబుళ్లు రాంబాబు, బి.వి.కృష్ణారావులను ఘనంగా సన్మానించారు. అదనపు ఎస్పీలు తిప్పేస్వామి, విఠలేశ్వరరావు, డీఎస్పీ కె.ఎస్.నివాసర్, ఏవో గోపినాథ్ పాల్గొన్నారు.

అడిషనల్ డీఎంహెచ్‌ఓ స్వచ్ఛంద ఉద్యోగ విరమణ

అరసవల్లి: జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయంలో అడిషనల్ డీఎంహెచ్‌ఓగా పనిచేస్తున్న డాక్టర్ ఎస్.అనురాధ బుధవారం స్వచ్ఛందంగా ఉద్యోగ విరమణ చేశారు. ఈమె టీబీ, లెప్రసీ నివారణాధికారిగా పనిచేశారు. కొన్ని రోజులు ఇన్‌చార్జి డీఎంహెచ్‌ఓగా కూడా పనిచేశారు. ఉద్యోగ విరమణ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ బొడ్డేపల్లి మీనాక్షి తదితరులు బుధవారం అనూరాధను సత్కరించారు.

అక్కచెల్లెమ్మలకు ఆర్థిక 'ఆసరా'

- ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సీఎం జగన్
- ఆనందంలో మహిళలు



నా పేరు కర్రి రమణమ్మ, జొన్నలపాడు కాలనీ, రామచంద్రాపురం పంచాయతీ. ఈ ప్రభుత్వంలో ఆసరా పథకం ద్వారా రూ. 70,248 రుణమాఫీ వచ్చింది. భర్త తెచ్చిన ఆదాయం సరిపోతున్నా ఖర్చులు పెరిగిపోవడంతో ఇంట్లోనే బట్టల వ్యాపారం ప్రారంభించాను. వ్యాపారం బాగానే జరుగుతుంది. ముఖ్యమంత్రి జగనన్న ఇచ్చిన మాట ప్రకారం ఇప్పటికే మూడు విడతల డబ్బులు నా బ్యాంకు ఖాతాలో వేశారు. ఖర్చు పెట్టకుండా వ్యాపారానికి వినియోగించాను. కొంతరుణాన్ని బ్యాంకు నుంచి తీసుకున్నాను. పిల్లలకు అమ్మఒడి డబ్బులు అందుతున్నాయి. గత ప్రభుత్వంలో రుణాలు మాఫీ కట్టకపోవడంతో చివరకు అధిక వడ్డీలకు రుణాలు తెచ్చుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. ఈ ప్రభుత్వం ఇచ్చిన భరోసాతో సంతోషంగా ఉంది.



గార ఆసరా సంబరాల్లో పాల్గొన్న మహిళలు (ఫైల్)

గార: గ్రామీణ ప్రాంత మహిళలు, కుటుంబాల జీవనపరిస్థితులు మెరుగుపడాలి. స్వయం ఉపాధి అవకాశాలు పెంపొందించుకోవాలన్న ఆలోచనల నుంచి పుట్టిందే డ్వాక్రా పథకం. మహిళల్ని సంఘటిత పరిచి, వారి అభ్యున్నతికి ప్రభుత్వం చేదోడుగా నిలవాలి. గత ప్రభుత్వం హామీ ఇచ్చి పీకల్లోతు ఇబ్బందుల్లోకి నెట్టింది. 2014లో టీడీపీని గెలిపిస్తే డ్వాక్రా రుణాన్ని పూర్తిగా మాఫీ చేస్తామని మాట ఇచ్చి ఓట్లు వేశాక ఈ సంగతే అప్పటి టీడీపీ ప్రభుత్వం మర్చిపోయింది. బ్యాంకుల వద్దకు వెళ్లలేక, వాయిదాలు ఉండిపోయిన సొమ్మును చెల్లించలేక అక్కచెల్లెమ్మలు ఇబ్బందులు పడేవారు. ఐదేళ్ల పాలన పూర్తయ్యే సమయం వచ్చినా టీడీపీ ఇచ్చిన మాట నెరవేర్చలేదు. దీంతో మహిళలు అనేక ఇబ్బందులు పడ్డారు.

వైఎస్సార్ కాంగ్రెస్ హయాంలో..

2019 ఎన్నికల ముందు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన సుదీర్ఘ పాదయాత్రలో మహిళల కష్టాలను విన్నారు. సీఎంగా బాధ్యతలు చేపట్టిన వెంటనే డ్వాక్రా రుణాలను నాలుగు విడతలుగా చెల్లిస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ముఖ్యమంత్రి అయిన తర్వాత మూడు విడతల్లో (75 శాతాన్ని) రుణాలను చెల్లించారు. చివరి విడతగా నాలుగో విడత రుణమాఫీ నిధులను ఆసరా సమావేశాల్లో జనవరి 24వ తేదీ నుంచి మహిళల ఖాతాల్లో వేసి అక్కచెల్లెమ్మకు ఆర్థిక ఆసరా కల్పించారు. గార మండలంలోని 25 పంచాయతీల్లో 46 గ్రామైఖ్య సంఘాల పరిధిలో 1876 స్వయంశక్తి సంఘాల్లో 20,309 మందికి రూ. 63.65 కోట్లను ఇప్పటివరకు చెల్లించారు. ఆసరా నిధులు విడుదల తర్వాత మహిళలు తమ సొంతకాళ్లపై నిలబడేందుకు ప్రయత్నాలు మొదలుపెట్టారు. వస్త్ర వ్యాపారం, కిరాణా దుకాణం, పశువులు, కోళ్ల పెంపకం వంటివి చేపట్టారు.

ఆర్థికాభివృద్ధి సాధిస్తారు



రుణమాఫీ కాకుండా నాలుగు విడతలుగా ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నాక మహిళలు ఎవ్వరి అప్పులు వారి తీర్చి బ్యాంకుల వద్ద మళ్లీ రుణాలు పొందారు. అక్కడి నుంచి ఆసరా డబ్బులు వేసిన ప్రభుత్వం ఆదేశాలతో నేరుగా సొంత ఖాతాలకు మాత్రమే నాలుగు విడతలుగా నిధులు వేశాం. మండలంలోని సభ్యులకు రూ. 63 కోట్ల 64 లక్షలు అందించాం. చాలా మంది చిరువ్యాపారాలు చేస్తూ ఆర్థిక అవసరాల నుంచి గట్టెక్కుతున్నారు.

-బి.ఎస్.భాగ్యలత, వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం, గార మండలం

ఫైనాన్షియర్ల బాధ తప్పింది



జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఏర్పడిన తరవాత ఫైనాన్స్ వ్యాపారుల బాధ తప్పింది. గతంలో ఒక్కోక్కరి నుంచి రోజూ వచ్చి రూ. 10 నుంచి రూ.100 వరకు వసూలు చేసేవారు. పండగైనా, కష్టం వచ్చినా కచ్చితంగా ఫైనాన్స్ సొమ్ము చెల్లించాల్సి వచ్చేది. నూటికి రూ. 6 నుంచి రూ. 10 వరకు వడ్డీ వసూలు చేసేవారు. ఆసరా నుంచి చేదోడు వరకు ఏటా ఒక్కో ఇంటికి లక్షలాది రూపాయలు లబ్ధి చేకూరింది. దీంతో అప్పుల బాధలు తప్పాయి. వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వంపై మరింత నమ్మకం పెరిగింది.

-పసుపులేటి లక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు, గార

అప్పుచేయటం లేదు



మా ఆయన చేపల పట్టేందుకు బోటుపై వెళ్తాడు. డీజిల్ కోసం అప్పుచేసి తీరంలోనే చేపలు తక్కువ ధరకు అమ్ముకునేవాళ్లం. ఆసరా తొలి విడతతో నాకు డబ్బులు అందాయి. మరెందుకు అప్పుచేయాలి అని అప్పుచేయకుండా బోటు నడిపాం. చేపలు ఎక్కువ ధరకు అమ్ముతున్నాం. దమ్ము, ధైర్యం సీఎం జగన్ భరోసాతోనే వచ్చింది. డ్వాక్రా రుణాలను రద్దు చేశారు. పిల్లలకు అమ్మఒడి వస్తోంది. జగన్‌కు రుణపడి ఉంటాం.

-కుమ్మరి ఎర్రమ్మ, మత్స్యకార మహిళ, బందరువానిపేట

వైఎస్సార్ బీమా అందజేత



వాసు భార్య మణికి రూ.లక్ష వైఎస్సార్ బీమా చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్, ఎంపీపీ చిరంజీవి

ఎచ్చెర్ల క్యాంపస్: ఫరీదుపేట గ్రామ సచివాలయం కన్వీనర్ పైడి వాసు అనారోగ్యంతో మృతి చెందారు. ఆ కుటుంబాన్ని ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం పరామర్శించారు. మృతిని భార్య మణికి వైఎస్సార్ బీమా రూ.లక్ష చెక్కు అందజేశారు. ఇదే గ్రామానికి చెందిన అంపోలు చిట్టిబాబు సిద్ధం సభకు వెళ్లి వస్తుండగా రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించారు. కేశవరావుపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ మండల యువజన విభాగం అధ్యక్షుడు కొత్తకోట సూర్యారావు చిన్నాన్న మొదలవలస సన్యాసిరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించారు. కుంచాలకూర్మయ్యపేట గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు బచ్చు ఆనంద రెడ్డి తల్లి గురమ్మ ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఎంపీపీ మొదలవలస చిరంజీవి, ఫరీదుపేట సర్పంచ్ కొత్తకోట పూర్ణచంద్రరావు, పార్టీ నాయకులు బోర గన్నయ్య, మెట్టదాలినాయుడు, సత్తారు గోపి, మొదలవలస కృష్ణారావు ఉన్నారు.

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):



మాట్లాడుతున్న శంకరరావు

బీసీలకు రాజ్యాధికారమే లక్ష్యంగా బీసీలంతా ఉద్యమించాలని ఏపీ బీసీ సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేసన శంకరరావు కోరారు. శ్రీకాకుళం నగరంలోని బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో బుధవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తమ సంఘం రాజకీయాలకతీతంగా పదేళ్లుగా బీసీల ఐక్యత, అభ్యున్నతే లక్ష్యంగా పనిచేస్తోందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా తమ సంఘం పర్యటనలు నిర్వహిస్తూ బీసీల చైతన్యమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్టు చెప్పారు. జనాభాలో 80% ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలకు రాజ్యాధికారాన్ని రాజకీయ పార్టీలు దూరం చేస్తున్నాయన్నారు. బీసీలంటే బ్యాక్వర్డ్ క్యాస్ట్ కాదు బ్యాక్ బోన్ అని గమనించాలన్నారు. బీసీ నాయకులంతా స్నేహపూర్వకమైన వాతావరణంలో రాజ్యాధికారం సాధించే దిశగా ఏకతాటిపైకి వచ్చి పోరాటం సాగించాలన్నారు. ఉత్తరాంధ్ర గౌరవ అధ్యక్షుడు కొమ్ము రమణమూర్తి మాట్లాడారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. తోనంగి వెంకన్న యాదవ్‌కు జనరల్ సెక్రెటరీగా, మైలపల్లి నరసింహమూర్తికు ఉపాధ్యక్షులుగా నియమించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పైడి చంద్రరావు (చందు), ఇప్పిలి మధుసూదనరావు, డి.సారధి, పాపారావు, దిలీప్ తాండ్ర, శ్రీనివాసరావు, పార్థసారధి, తిరుపతిరావు, పున్నయ్య పాల్గొన్నారు.

జిల్లా కలెక్టర్‌కు అభినందనలు



శ్రీకేష్ బి.లాఠకర్‌ను అభినందిస్తున్న నటుకుల మోహన్, దేవభూషణరావు

శ్రీకాకుళం కల్చరల్: బదిలీపై వెళుతున్న జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను లయన్స్ క్లబ్ సభ్యులు మంగళవారం అభినందించారు. మూడేళ్లపాటు జిల్లా అభివృద్ధికి చెందిన కృషిని అభినందించారు. కలెక్టర్‌ను అభినందించిన వారిలో లయన్స్ క్లబ్ సెంట్రల్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, కోశాధికారి టెక్కం రామ్ గోపాల్, లయన్స్‌క్లబ్ మెంటార్ నటుకుల మోహన్, బాడాన దేవభూషణరావు ఉన్నారు.

8 మద్యం సీసాల స్వాధీనం

ఎచ్చెర్ల క్యాంపస్: అల్లినగరంలోని పాన్ షాపులో నిల్వ ఉంచిన 8 మద్యం బాటిళ్లను మంగళవారం రాత్రి ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ ఆధ్వర్యంలోని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. లావేరు మండలం బయ్యన్నపేట నుంచి ఈ బాటిళ్లు తెచ్చినట్లు గుర్తించారు. శంకరరావుపై అనే వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యార్థులు దేశభక్తిని కలిగి ఉండాలి




వేదికపై అతిథులు



గీతాలను ఆలపిస్తున్న విద్యార్థులు

శ్రీకాకుళం కల్చరల్: విద్యార్థుల్లో దేశభక్తి పెంపు చేయడమే లక్ష్యంగా 'మన దేశం'కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఆంధ్ర విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తురకా ప్రసాద్ అన్నారు. విద్యార్థులు చిన్నప్పటి నుంచే దేశభక్తిని అలవర్చుకోవాలని చెప్పారు. స్థానిక ఎన్టీఆర్ మున్సిపల్ హైస్కూల్ మైదానంలో విద్యార్థులతో బుధవారం ప్రత్యేక కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమాన్ని తొలుత శ్రీకాకుళం నుంచి ప్రారంభించామన్నారు. అన్ని జిల్లాల్లో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. విద్యార్థుల్లో దేశభక్తి, మన సంస్కారం, సంస్కృతి పెంచేందుకు కృషి చేస్తున్నట్టు పేర్కొన్నారు. ఇందుకు సహకరించిన పాఠశాలలు, కళాశాలల యజమాన్యాలకు ధన్యవాదాలు తెలియజేశారు. వందేమాతర గీతం కోసం ఎస్‌సీఎస్ డైరెక్టర్ పి.శ్రీకాంత్ వివరించగా, సామూహికంగా విద్యార్థులంతా కలసి గీతాన్ని ఆలపించారు. ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాల పీడీ ఎ.మోహనరాజు మాతెలుగు తల్లి గీతం కోసం వివరించారు. ముందుగా పలు స్కూళ్లకు చెందిన విద్యార్థులు దేశభక్తి గీతాలతో నృత్య ప్రదర్శనలు చేశారు. కార్యక్రమంలో గాయత్రీ స్వచ్ఛంద సంఘం ప్రతినిధి శవ్వాన ఉమామహేశ్వరి, ఆంధ్ర విద్యార్థి సంఘం జిల్లా ప్రతినిధులు జితేంద్ర, మహేష్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలి



రికార్డులు తనిఖీ చేస్తున్న ఆర్‌ఎఫ్ఓ నిరంజన్‌రెడ్డి

రణస్థలం: పరిశ్రమల్లో, గ్రామాల్లో, ఇతర ప్రదేశాల్లో అగ్ని ప్రమాదాల నివారణపై ఎప్పటికప్పుడు ప్రజలకు అవగాహన సదస్సులు నిర్వహించాలని విశాఖపట్నం ప్రాంతీయ అగ్నిమాపకాధికారి డి.నిరంజన్ రెడ్డి తెలిపారు. మండల కేంద్రంలోని రణస్థలం అగ్నిమాపక కార్యాలయాన్ని బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ రికార్డులు పరిశీలించి పలు సూచనలు చేశారు. అగ్ని ప్రమాదాలు సంభవించినప్పుడు తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. అగ్ని ప్రమాదాలు అరికట్టడంలో ప్రజలకు ఉన్న అవగాహనే తీవ్రత తగ్గించడంలో కీలకమన్నారు. అగ్ని ప్రమాద కాల్స్ వచ్చినప్పుడు సకాలంలో హాజరై ప్రాణ, ఆస్తి నష్టం తగ్గించటంలో కృషి చేయాలన్నారు. అగ్నిమాపక వాహనం సరైన కండీషన్‌లో ఉంచాలని, నిత్యం పర్యవేక్షణ ఉండాలన్నారు. రణస్థలం అగ్నిమాపక ఎస్ఐ పి.అశోక్, సిబ్బంది ఉన్నారు.

క్రీడాకారుడికి సత్కారం



సత్యంను సత్కరిస్తున్న ఎమ్మెల్యే కిరణ్‌కుమార్

రణస్థలం: ఆంధ్రప్రదేశ్ వాలీబాల్ జట్టులో స్ట్రైకర్‌గా సేవలందిస్తున్న మైలపల్లి సత్యంను (కొవ్వాడ పంచాయతీ) ఎచ్చెర్ల ఎమ్మెల్యే గొర్లె కిరణ్‌కుమార్ బుధవారం ప్రత్యేకంగా కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఖేలో ఇండియా యూత్ వాలీబాల్ పోటీల్లో తృతీయ స్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవడం ఎంతో సంతోషదాయకమన్నారు. ఇలాంటి విజయాలను మరెన్నో సాధించాలని ఆకాంక్షించారు.

పరామర్శ..

కొవ్వాడ గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ కార్యకర్త మైలపల్లి తవుడు మనవడు మైలపల్లి పోతయ్య ఇటీవల హైదరాబాద్‌లో రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. ఆ కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కొవ్వాడ సర్పంచ్ అల్లిపల్లి రాముడు, వైఎస్సార్‌సీపీ నాయకులు మైలపల్లి జగ్గులు, గురువులు, పట్టయ్య, నాగేంద్ర తదితరులు ఉన్నారు.

సేవలే ఉద్యోగికి గుర్తింపు



కృష్ణారావు దంపతులను సన్మానిస్తున్న తహసీల్దార్, రెవెన్యూ సిబ్బంది

జి.సిగడాం: అంకితభావంతో పనిచేసే ఉద్యోగికి సమాజంలో గుర్తింపు ఉంటుందని తహసీల్దార్ పప్పల వేణుగోపాలరావు అన్నారు. స్థానిక రెవెన్యూ కార్యాయలంలో డిప్యూటీ సర్వేయర్‌గా పనిచేసి ఉద్యోగ విరమణ చేసిన జి.కృష్ణారావును బుధవారం సన్మానిచారు. డీటీలు ఎస్.నిర్మల, కె.గాయత్రి, ఆర్ఐ రామచంద్రరావు, వీఆర్‌ఓలు, సర్వేయర్లు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ఎచ్చెర్ల క్యాంపస్: బీఆర్ అంబేడ్కర్ బాలికల గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.లక్ష్మి తెలియజేశారు. 2024-25 విద్యా సంవత్సరంలో ఈ ప్రవేశాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దరఖాస్తుల స్వీకరణ జనవరి 25వ తేదీ నుంచి కొనసాగుతోందని, ఫిబ్రవరి 23వ తేదీ చివరి రోజు అన్నారు. దరఖాస్తులు ఆన్‌లైన్‌లో హెచ్‌టీటీ పీఎస్:ఏపీబీఆర్ఏఆర్‌సీఈటీ.ఏపీసీఎఫ్ఎస్ఎస్.ఐఎన్ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 5వ తరగతిలో 80, ఇంటర్మీడియెట్ ఎంపీసీలో 40, బైపీసీలో 40 సీట్లు ఉన్నాయన్నారు. ప్రవేశ పరీక్ష మార్చి 10వ తేదీన ఐదో తరగతికి ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, ఇంటర్మీడియెట్‌కు మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు.

ఎన్‌వైకే అడ్వయిజరీ బోర్డు సభ్యుడుగా నరేంద్రచక్రవర్తి

శ్రీకాకుళం న్యూకాలనీ: నెహ్రూ యువ కేంద్రం సంఘటన (ఎన్‌వైకేఎస్) అడ్వయిజరీ బోర్డు సభ్యుడుగా బీజేపీ యువజన విభాగం జిల్లా అధ్యక్షులు బూరె నరేంద్ర చక్రవర్తి నియామకం అయ్యారు. ఈ మేరకు కేంద్ర యూత్ అఫైర్స్ అండ్ స్పోర్ట్స్ వ్యవహారాల శాఖ మంత్రివర్యులు అనురాగ్ ఠాకూర్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు.

పారదర్శకంగా కారుణ్య నియామకాలు

అరసవల్లి: జిల్లాలో పంచాయతీరాజ్, జిల్లాపరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేసి మరణించిన పలువురు ఉద్యోగుల కుటుంబాల్లో అర్హులకు పారదర్శకంగా కారుణ్య నియామకాలు చెపట్టామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. జెడ్పీ బంగ్లాలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పిసిని అనూష, ఎ.గిరిప్రసాద్, టైపిస్టుగా జి.హేమలత, ఆఫీస్ సబార్డినేట్లుగా బొడ్డేపల్లి ప్రియాంక, ఎం.కె.ఎం.ఎస్.సంతోష్‌లకు నియామకపత్రాలను ఆమె అందజేశారు.

కలెక్టర్ సేవలు మరువలేనివి



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌ను అభినందిస్తున్న సూరిబాబు

శ్రీకాకుళం పాతబస్టాండ్: కలెక్టర్‌గా శ్రీకేష్ బి.లాఠకర్ జిల్లా ప్రజల గుండెల్లో సుస్థిరమైన ప్రేమాభిమానాలను చూరగొన్నారని కళింగ వైశ్య, భేరి వైశ్య కార్పొరేషన్ చైర్మన్ అంధవరపు సూరిబాబు అన్నారు. బదిలీపై వెళ్తున్న కలెక్టర్‌ను తన బంగ్లాలో బుధవారం కలిసి పుష్పగుచ్ఛాన్ని అందజేసి దుశ్శాలువతో సత్కరించారు. రెండున్నర ఏళ్లకుపైగా జిల్లాలో మంచి సేవలు అందించారని సూరిబాబు అన్నారు. ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశాలైన నవరత్నాల పథకాలు అమలు చేయడంలోనూ, జిల్లాలో చేపట్టిన కీలక ప్రాజెక్టులు కార్యరూపం దాల్చడంలో ప్రత్యేక శ్రద్ధ వహించారన్నారు.

ప్రత్యేక హోదా సాధనకు నడుంబిగిద్దాం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): రాష్ట్రానికి ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేసేంతవరకు పోరాటాన్ని కొనసాగిస్తామని రాష్ట్ర ప్రత్యేక హోదా విభజన హామీల సాధన సమితి అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చలసాని శ్రీనివాస్, విశ్రాంత జాయింట్ డైరెక్టర్ సీబీఐ లక్ష్మీనారాయణ అన్నారు. శ్రీకాకుళం నగరంలోని ఓ హోటల్‌లో బుధవారం మీడియా సమావేశం నిర్వహించారు. వెనుకబడిన ప్రాంతాలైన ఉత్తరాంధ్ర, రాయలసీమకు కేబీకే బుందేల్‌ఖండ్ తరహాలో ప్రత్యేక ప్యాకేజీ విడుదల చేయాలని, ఉమ్మడి ఆస్తుల పంపకాలను జరిపి రాష్ట్రానికి రావాల్సిన వాటాను అప్పగించాలని, విశాఖ రైల్వే జోన్ ఏర్పాటు చేయాలని, వైజాగ్ స్టీల్ ప్లాంట్‌కు ప్రత్యేక గనులు కేటాయించి నిధులు సమకూర్చి అభివృద్ధి చేయాలని, శ్రీకాకుళం జిల్లాలో కేంద్ర విద్యా సంస్థలను నెలకొల్పి నిధులు సమకూర్చాలని తదితర డిమాండ్ల సాధన కోసం ఫిబ్రవరి 7, 8 ,9 తేదీలలో ఢిల్లీలో పోరాటం కొనసాగుతుందన్నారు

శ్రీకాకుళం తహసీల్దార్‌కు బదిలీ

శ్రీకాకుళం రూరల్: శ్రీకాకుళం మండల తహసీల్దార్ ఎస్.వెంకట్రావు విశాఖ జిల్లాకు బదిలీ అయ్యారు. ఈమేరకు బుధవారం రాష్ట్ర ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. సుమారు మూడేళ్ల శ్రీకాకుళంలో విధులు నిర్వహించారు.